# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

- రైతులు తమ పంట ఉత్పత్తులను సులభంగా అమ్ముకునేందుకు "వాట్సాప్ గవర్నెన్స్"ను ఉపయోగించుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

- రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్నవారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ రెండవ ఇన్నింగ్స్ లో ఈరోజు భోజన విరామ సమయానికి 4 వికెట్లు నష్టపోయి 98 పరుగులు చేసింది.

==============================

దిగ్గజ సినీ నటులు, మాజీ శాసనసభ్యులు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో కోట శ్రీనివాసరావు భౌతికకాయానికి చంద్రబాబు నాయుడు నివాళులర్పించి.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 24 సెకన్లు)

అదేవిధంగా కోటా శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం తెలియజేశారు.

==============================

రైతులు తమ పంట ఉత్పత్తులను సులభంగా అమ్ముకునేందుకు "వాట్సాప్ గవర్నెన్స్"ను ఉపయోగించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. గుంటూరు జిల్లా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ

రోజు 33 మంది రైతులకు 80 శాతం రాయితీపై సుమారు 12 లక్షల 38 వేల రూపాయల విలువైన యంత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... వాట్సాప్ లో హాయ్ అని సందేశం పంపితే రైతుల వద్దకే అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని, అధికారులను కలవాల్సిన అవసరం లేదని అన్నారు. పండించే పంటలపై రైతులు అవగాహన పెంచుకుంటే అధిక ఆదాయాన్ని పొందగలుగుతారని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

==============================

రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్నవారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ రోజు అనకాపల్లి జిల్లా రామయ్యపట్నం గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభమవుతుందని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

==============================

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈ రోజు 13 మంది లబ్ధిదారులకు వారి వైద్య ఖర్చుల కోసం 26 లక్షల 19 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నదని తెలిపారు.

==============================

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారంపై తహశీల్దార్లు మరింత దృష్టి సారించాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. ఈ రోజు నెల్లూరులో రెవిన్యూ అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భూముల రీసర్వే, నీటిపన్నుల వసూళ్లు, పిజిఆర్ఎస్ అర్జీల పురోగతి, అందరికీ ఇల్లు మొదలైన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తహశీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటిస్తే... సమస్యలకు మెరుగైన పరిష్కారం లభిస్తుందన్నారు.

విరామం

==============================

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "స్వచ్ఛ సర్వేక్షన్" అవార్డులలో రాష్ట్రానికి ఐదు అవార్డులు రావడం పట్ల రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరులో ఈ రోజు జరిగిన ఎస్.పి. బాలసుబ్రమణ్యం పార్క్ రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నెల్లూరు నగరంలో చెత్తను తొలగించేందుకు 28 స్వీపింగ్ యంత్రాలను కేటాయించామన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు 54 పార్కులను అభివృద్ధి చేశామని... మరిన్ని పార్కులను ఆధునీకరిస్తామని వెల్లడించారు. వచ్చే సంవత్సరం నాటికి మరిన్ని "స్వచ్ఛ సర్వేక్షన్" అవార్డులు సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

==============================

ఆషాఢ ఆదివారం సందర్భంగా విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు వస్తున్న భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటాలడుతోంది. ఈ రోజు మధ్యాహ్నం నాటికి సుమారు 40 వేలకు పైగా భక్తులు అమ్మవారినీ దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అంతరాలయం, విఐపి బ్రేక్ దర్శనాలను అధికారులు రద్దు చేశారు.

==============================

విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందల్ ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు, గుట్కాలు వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో తనిఖీలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

==============================

లండన్ లో లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ ఆసక్తి కరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో ఇరు జట్లు సమాన స్కోర్ చేయడంతో ఆఖరి రెండు రోజుల ఆట ఉత్కంఠ రేపుతోంది. నాల్గవ రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండవ ఇన్నింగ్స్‌లో భోజన విరామ సమయానికి 4 వికెట్లకు 98 పరుగుల చేసింది.

==============================

విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కె.జి.హెచ్)లో ఈరోజు ట్రైబల్ వైద్య సేవల విభాగాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధిలో గిరిజనులకు మెరుగైన వైద్య సహాయాన్ని ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో ట్రైబల్ విభాగంలో అందిస్తున్నామని తెలిపారు.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్యం పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా... రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

==============================